సీఎం వస్తున్నారని స్కూళ్లకు సెలవు

ప్రైవేట్ పాఠశాలల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

మంచిర్యాలటౌన్/సీసీసీ నస్పూర్/నస్పూర్, ఫిబ్రవరి 23 : ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు నేడు సీఎం రేవంత్ రెడ్డి మంచిర్యాల జిల్లాకు వస్తున్న నేపథ్యంలో సోమవారం స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. నస్పూరులోని కలెక్టరేట్ భవన సమీపంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభ కోసం పలు ప్రైవేట్ స్కూళ్లకు యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి. జిల్లాలో రెండు ట్రస్మాలు ఉండగా, ఒకవర్గం వారు సంత్‌లాల్ జయంతి సందర్భంగా సెలవు ఇస్తున్నట్టు ప్రకటించగా, మరో వర్గం సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సెలవు ఇస్తున్నట్టు ప్రకటించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల యా జమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల మద్దతు కోసం ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ప్రకటించి, టీచర్లను మీటింగ్‌కు తరలిస్తారేమోనని ఆరోపిస్తున్నారు.

ట్రంప్ చర్యలు ఆక్షేపణీయం

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్,ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): అక్రమ వలసదారుల పేరు తో ట్రంప్ అవలంబిస్తున్న చర్యలు ఆక్షేపణీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు. ట్రం ప్ ప్రభుత్వం వలసదారులను తిప్పిపంపే క్రమంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం అమెరికా పార్లమెం ట్ ముందు నుంచి ఆయన ఒక వీడి యో విడుదల చేశారు. అక్రమ వలసదారులను పంపడాన్ని తాము వ్యతిరేకించడం లేదని.. కానీ ట్రంప్ ఎన్నుకున్న విధానం సరిగా లేదని విమర్శించారు. ట్రంప్ చర్యలతో యువత జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని పేర్కొన్నారు. వలసదారులకు కొంత సమయం ఇచ్చి... సుహృద్భావ వాతావరణంలో తిప్పిపంపే విధంగా చర్యలు చేపట్టాలని నారాయణ కోరారు.

'హ్యామ్' రోడ్లకు చుక్కెదురు!

- రోడ్ల మరమ్మతు, పునరుద్ధరణకు కావాల్సింది 17.5 వేల కోట్లు
- ప్రభుత్వం 60శాతం, టోల్‌ట్యాక్స్ 40 శాతం వసూలుకు ప్లాన్
- కాంట్రాక్టర్లకు ఏడాది కాలంగా బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- ప్రభుత్వం 40 శాతం నిధులు ఎలా ఇస్తుందని అనుమానాలు
- సర్కారుపై ఏజెన్సీల అసంతృప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం, హ్యామ్) రోడ్లకు ఏజెన్సీలు విముఖత చూపుతున్నాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా వస్తాయనే నమ్మకం ఏజెన్సీల్లో ఏమాత్రం లేకపోవడంతో ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తుంది. రాష్ట్రంలో వానాకాలంలో పాడైన రోడ్లకే ఇంత వరకు మరమ్మతులు చేపట్టపోగా, చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులకు సంబంధించి సుమారు రూ. 1000 కోట్ల వరకు బిల్లులు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు హ్యామ్ రోడ్లకు తాము మళ్లీ పెట్టుబడి పెడితే అవి ఎప్పటికీ వసూలవుతాయో అని ఏజెన్సీల సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి.

రోడ్ల మరమ్మతులకు అత్తెసరు నిధులు..

నిరుడు కురిసిన భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రంలో రోడ్లకు భారీగా నష్టం వాటిల్లిన విషయం విదితమే. దీంతో ఖమ్మం జిల్లాతో సహా వివిధ జిల్లాల్లో కేంద్ర బృందం కూడా నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించింది. ఆర్‌అండ్‌బీ శాఖ రోడ్ల నష్టాన్ని అంచనా వేసి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. సుమారు 2553 కిలో మీటర్ల మేర రోడ్లకు నష్టం జరిగినట్లు, 902 హైలెవల్ బ్రిడ్జీలు, 391కల్వర్టులు, 166 బ్రిడ్జీలకు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. శాశ్వత మరమ్మతులకు రూ. 2462 కోట్లు, తాత్కాలిక మరమ్మతులకు రూ.100 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం మాత్రం రూ. 15 కోట్ల అత్తెసరు నిధులతో సరి పెట్టింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్లాన్ నిధుల కింద రూ. 518కోట్లు, నాన్ ప్లాన్ కింద రూ. 888 కోట్లు కేటాయించింది. అంతేకాకుండా స్పిల్ ఓవర్ నిధులు కూడా భారీగానే బడ్జెట్‌లో చూపించారు.

హ్యామ్‌కు నిధులెక్కడ?

ఇదిలావుండగా, తమతమ నియోజకవర్గాల్లో కొత్త రోడ్లతోపాటు ఇప్పటికే ఉన్న రోడ్ల విస్తరణ, ముంపు ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం తదితర పనుల కోసం ఎమ్మెల్యేల నుంచి ఆర్‌అండ్‌బీకి భారీగా ప్రతిపాదనలు వచ్చాయి. ఈ పనుల విలువ సుమారు రూ. 15,000 కోట్లకుపైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో తప్ప ఎక్కడా నిధులు మంజూరు కాలేదు. దీంతో చాలామంది ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం.

మరమ్మతు బిల్లులకే దిక్కులేదు..

ఎమ్మెల్యేల వినతుల ప్రకారం నియోజకవర్గాల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణం, రోడ్ల పునరుద్ధరణ పనులకు రూ. 15,000 కోట్లు, వానాకాలంలో పాడైపోయిన రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణకు మరో రూ. 2562 కోట్లు కలుపుకొని మొత్తం 17.5 వేల కోట్లకు పైగా నిధులు కావాల్సి వుంది. ప్రభుత్వం హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ, నిర్వహణ తదితర పనులు చేపట్టాలని నిర్ణయించింది. దీనికి అయ్యే వ్యయంలో ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. అయితే మరమ్మతుల బిల్లులకే దిక్కులేదు.. ఇప్పుడు కొత్తగా రోడ్లకు ప్రభుత్వం 40శాతం నిధులు ఎక్కడి నుంచి ఇస్తుందని ఏజెన్సీలు ప్రశ్నిస్తున్నాయి.

ఇదీ హ్యామ్ విధానం...

ఇది పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో రోడ్డు పనులు చేపట్టే విధానం. ప్రాజక్టు వ్యయంలో 40 శాతం ప్రభుత్వం ఐదేళ్లలో ఏటా కొంత చొప్పున గ్రాంట్ల రూపంలో అందించనుండగా, మిగిలిన 60 శాతం సంబంధిత ఏజెన్సీలు రుణం రూపంలోనో లేక ఈక్విటీ రూపంలో సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అనంతరం వారు పెట్టిన పెట్టుబడి వడ్డీతోపాటు ఏటా ప్రభుత్వం చెల్లిస్తుంది. లేనిపక్షంలో టోల్ విధానంలో వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. నిర్ధారిత గడువు వరకు, సుమారు 15 ఏండ్ల పాటు ప్రాజక్టు నిర్వహణ బాధ్యత కూడా సంబంధిత ఏజెన్సీపైనే ఉంటుంది. అయితే, దీనికి అయ్యే ఖర్చు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

బడ్జెట్‌లో రోడ్ల కేటాయింపుల వివరాలు..

2024-25 బడ్జెట్‌లో ప్లాన్ నిధుల కింద కేటాయించినవి రూ.518.58

స్పిల్ ఓవర్ కమిట్‌మెంట్ రూ.5266	నాన్‌ప్లాన్ కింద కేటాయింపు రూ.888.45
స్పిల్ ఓవర్ కమిట్‌మెంట్ రూ.3084	ఇప్పటి వరకు విడుదల చేసింది రూ.0

వానకాలంలో పాడైన రోడ్లు, మరమ్మతులకు కావాల్సిన నిధుల వివరాలు.....

రోడ్లు	కిలోమీటర్లు	తక్షణ మరమ్మతులకు నిధులు(రూ. కోట్లలో)	శాశ్వత మరమ్మతులకు నిధులు
స్టేట్ రోడు	1671.4	61.11	1020
ఇతర జిల్లా రోడ్లు(ఓడీఆర్)	882	26.27	374
కల్వర్టులు/బ్రిడ్జీలు	391	12.72	166
హైలెవల్ బ్రిడ్జీలు	-	-	902
మొత్తం	2553.4	100.09	2462
ప్రభుత్వం ఇచ్చిన నిధులు	15	-	-

భూతగాదాతోనే హత్య

మొదటిపేజీ తరువాయి...

చేశామని, వీరిలో ఏ1 రేణికుంట్ల సంజీవ్, ఏ2 పింగిలి సేమంత్, ఏ3 మోరె కుమార్, ఏ4 కొత్తూరి కిరణ్, ఏ5 రేణికుంట్ల కొమరయ్య, ఏ6 దాసారపు కృష్ణ, ఏ7 రేణికుంట్ల సాంబయ్యను అరెస్టు చేశామని వివరించారు. ఏ 8 కొత్త హరిబాబు, ఏ9 పుల్ల నరేశ్, ఏ10 పుల్ల సురేశ్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఘటనకు సంబంధించి ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజలింగమూర్తి, నిందితులకు భూపాలపల్లిలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎకరం భూమి విషయంలో తగాదా నడుస్తున్నది. ఇరువర్గాల వారు కోర్టుకు కూడా వెళ్లారు. తన కుటుంబ సభ్యుల నుంచి ఎకరం భూమిలో కొంత భాగాన్ని రాజలింగమూర్తి మోసపూరితంగా రాయించుకున్నాడని నిందితుల్లో ఏ1గా ఉన్న రేణికుంట్ల సంజీవ్ కక్ష పెంచుకున్నాడు. రాజలింగమూర్తిని చంపితేనే తమ భూమి తమకు దక్కుతుందని అనేక సార్లు తన కుటుంబసభ్యులతో సంజీవ్ చెప్పాడు. ఇందుకోసం బంధువులను కూడా సహాయం చేయాలని కోరాడు. భూపాలపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబుకు తెలపగా ఆయన సైతం సరేనన్నాడు. ఈ నెల 19న సంజీవ్ కోర్టు పేషీకి వెళ్లగా అక్కడ రాజలింగమూర్తి కనిపించాడు. ఎలాగైనా రాజలింగమూర్తిని చంపేయాలని భావించి సంజీవ్, కృష్ణ, నరేశ్, కిరణ్, కుమార్, బబ్లూ కలిసి పథకం వేశారు. సంజీవ్ ఇంటి వద్ద దాచిన కత్తులు, రాడ్డు తీసుకొని రాజలింగమూర్తి ఇంటి సమీపంలో కాపుకాశారు. అదే రోజు సాయంత్రం 6:45 గంటలకు రాజలింగమూర్తి తన ఇంటి సమీపంలోకి రాగానే కత్తులు, రాడ్డుతో దాడి చేసి బైక్‌లపై పారిపోయారు. తీవ్రగాయాలతో రాజలింగమూర్తి అక్కడికక్కడే చనిపోయాడు. నిందితులు శనివారం సాయంత్రం 6:30 గంటలకు కేటీకే-5 ఇంక్లైన్ చెక్ పోస్ట్ సమీపంలో కలిసి పారిపోవాలని మాట్లాడుకుంటుండగా భూపాలపల్లి పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన పోలీసులు వారిని పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు.

కవిత సాయంతో ఏర్పాటు చేసుకున్న ఇంటర్‌నెట్ సెంటర్‌లో సతీశ్

ఎమ్మెల్సీ కవిత గొప్ప మనసు

- కేసీఆర్ వీరాభిమాని సతీశ్‌కు కల్వకుంట్ల కవిత చేయూత
- ఇంటర్నెట్ సెంటర్‌కు సాయం
- నేడు ప్రారంభించనున్న కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి గొప్ప మనసు చాటుకున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వీరాభిమాని, దివ్యాంగుడైన చిర్రా సతీశ్‌కు ఆర్థికంగా చేయూతనందించారు. కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని సతీశ్ సొంతూరు మహబూబాబాద్ జిల్లా రామానూజపురంలో సొంత ఖర్చులతో ఇంటర్నెట్-జిరాక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయించారు. సోమవారం ఆ జిల్లా పర్యటనకు వెళ్లనున్న కవిత దీన్ని ప్రారంభించనున్నారు. అనంతరం మరిపెడ మండలం చిల్లంచర్లలో జాగృతి మహిళా నేత మరిపెల్లి మాధవి గృహప్రవేశానికి హాజరవుతారు.

అడిగిన వెంటనే అభయం

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామానికి చెందిన చిర్రా సతీశ్‌కు చిన్నప్పటి నుంచే కేసీఆర్ అంటే ఎంతో అభిమానం. 2001లో టీఆర్ఎస్ స్థాపించిన నాటి నుంచి కార్యకర్తగా తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. అదే సమయంలో ఆర్థిక ఇబ్బందులు, అంగవైకల్యాన్ని ఎదిరించి ఆత్మస్థైర్యంతో డిగ్రీ పూర్తి చేశారు. ఫిబ్రవరి 17 కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా తనకు ల్యాప్‌టాప్, జిరాక్స్ మిషన్ కొనిపించి స్వయం ఉపాధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్సీ కవితకు మెస్సేజ్ చేశారు. ఆమె వెంటనే స్పందించి అభయమిచ్చారు. వారం కూడా తిరగకముందే ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్‌కు కావాల్సిన పరికరాలను సమకూర్చారు.

కేసీఆర్ పేరిట ఇంటర్నెట్ సెంటర్

ఈ ఇంటర్నెట్ సెంటర్‌కు తన అభిమాన నేత కేసీఆర్ పేరును సతీశ్ పెట్టారు. పెద్ద మనస్సుతో సాయం చేసిన ఎమ్మెల్సీ కవితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్, కవితకు తన కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని చెప్పారు.

ఎల్ఆర్ఎస్ చార్జీల్లో అయోమయం!

ప్రక్రియ తీరుపై మండిపడుతున్న దరఖాస్తుదారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రకటించిన లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)పై చిక్కుముళ్లు వీడటం లేదు. ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియపై స్పష్టత కొరవడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. 2020 ఆగస్టు 26 కంటే ముందు వచ్చిన 25.60 లక్షల దరఖాస్తులకు మాత్రమే అప్పటి మార్కెట్ ధరలకు అనుగుణంగానే ఎల్ఆర్ఎస్ చార్జీలు వసూలు చేస్తామని ప్రభుత్వ ప్రకటించింది. కానీ కటాఫ్ తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులకు పాత మార్కెట్ ధరలు వర్తిస్తాయా? కొత్త ధరలు వర్తిస్తాయా? అన్న అంశంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని జనం వాపోతున్నారు. 2020 తర్వాత వచ్చిన దరఖాస్తుదారులకు ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఫీజులు వసూలు చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. అధికారులను అడిగితే తమకు కూడా అవగాహన లేదని చేతులెత్తేస్తున్నారని వాపోతున్నారు. ఎల్ఆర్ఎస్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధిక ధరలు వసూలు చేసినట్టయితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశాలు ఉంటాయని దరఖాస్తుదారులు, మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ఆస్తి కోసం అన్నను చంపారు!

- కర్రతో కొట్టి హత్యచేసిన చెల్లెళ్లు
- జగిత్యాలలో ఘటన

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : ఆస్తి కోసం సొంత అన్ననే ఇద్దరు చెల్లెళ్లు దారుణంగా హత్య చేశారు. కట్టెతో కొట్టి.. పిడిగుద్దులు గుద్ది ప్రాణం తీశారు. జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, మృతుడి భార్య విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన జంగిలి బసవయ్యకు కొడుకు శ్రీనివాస్, కూతుళ్లు వరలక్ష్మి, శారదతోపాటు మరో కూతురు ఉంది. శ్రీనివాస్ ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతని పెద్ద చెల్లె భారతపు వరలక్ష్మి భర్త 22 ఏండ్ల క్రితం చనిపోవడంతో అప్పటి నుంచి తల్లిగారి ఇంట్లోనే ఉంటోంది. శ్రీనివాస్ మరో చెల్లెలు వొడ్నాల శారద భర్తను వదిలేసి వీరి ఇంటికి సమీపంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నది. ఈ క్రమంలో శ్రీనివాస్ ఇంటికి ఆనుకొని ఉన్న 100 గజాల స్థలాన్ని తమకు ఇవ్వాలని వరలక్ష్మి, శారద తండ్రి బసవయ్యపై ఒత్తిడి తేవడం ప్రారంభించారు. సదరు స్థలాన్ని కొడుకు శ్రీనివాస్‌కు ఇస్తానని తండ్రి పదేండ్ల కిందటే చెప్పడంతో వరలక్ష్మి, శారద గొడవ చేసి శ్రీనివాస్‌పై కేసులు పెట్టారు. సదరు కేసు కోర్టులో నేటికీ నడుస్తున్నది. అప్పటి నుంచి శ్రీనివాస్‌ను ఇద్దరు చెల్లెళ్లు ఇష్టంవచ్చినట్లు తిట్టడం, నిత్యం గొడవలకు దిగుతుండడంతో శ్రీనివాస్ భార్య విజయలక్ష్మి పిల్లలతో కలిసి హనుమాన్ వాడలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకునేందుకు శ్రీనివాస్ తరచూ వారి ఇంటికి వెళ్లేవాడు. ఆదివారం తల్లిదండ్రులకు టిఫిన్ ఇద్దామని శ్రీనివాస్ వెళ్లాడు. అక్కడ అన్నను చూసిన వరలక్ష్మి, శారద 'ఇక్కడికెందుకు వచ్చినవు.. నీ వల్లనే గొడవలు జరుగుతున్నయి. కోర్టు దాకా వెళ్లాల్సి వచ్చింది. నువ్వు సత్తెనే అన్ని లొల్లులు పోతయి' అని శ్రీనివాస్‌ను ఇష్టం వచ్చినట్లు తిడుతూ దాడికి దిగారు. బసవయ్య చేతికర్రను తీసుకుని వరలక్ష్మి శ్రీనివాస్ తల వెనుక భాగంలో దాడి చేయగా, శారద పిడిగుద్దులు గుద్దడంతో రోడ్డుపై స్పృహతప్పి పడిపోయాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ భార్య వరలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని బంధువులు, స్థానికుల సహాయంతో శ్రీనివాస్‌ను జగిత్యాల జిల్లా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు శ్రీనివాస్ మృతిచెందినట్టు నిర్ధారించారు. ఇద్దరు ఆడబిడ్డలు భర్తను కట్టెలతో కొట్టి అన్యాయంగా చంపారని మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వేణుగోపాల్ తెలిపారు.

రాహుల్‌కు 'బీసీ' నెగెటివ్ రిపోర్ట్!

మొదటిపేజీ తరువాయి...

ఒక్కొక్కరుగా ఢిల్లీ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్, తాజాగా మాజీ ఎంపీ మధుయాష్కీ కులగణన సర్వే తీరుపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అంతకంటే ముందు రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక మంత్రి ఒకరు కులగణన సర్వే తీరు మీద రాహుల్‌గాంధీకి నెగిటివ్ రిపోర్టు ఇచ్చినట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కులగణన తప్పులతడక అని బరాబర్ ఢిల్లీ అధిష్ఠానానికి తాను ఫిర్యాదు చేసినట్టు తీన్మాన్ మల్లన్న బహిరంగంగానే చెప్పారు. కానీ, ఇప్పటివరకు మధుయాష్కీ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు.

బీసీ జనాభాను తక్కువ చేసి చూపించారు

కులగణన తన డ్రీమ్ ప్రాజెక్టు అని రాహుల్‌గాంధీ ముందుగానే సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు తేల్చి చెప్పినట్టు తెలిసింది. తెలంగాణలో వచ్చే ఫలితాలు దేశవ్యాప్తంగా అమలుచేయాలనే ఆలోచనతో ఉన్నామని, ఇక్కడ చేపట్టబోయే కులగణన పైలట్ ప్రాజెక్టు లాంటిదని ఆయన ఒకటికి రెండు సార్లు విడమరిచి చెప్పినప్పటికీ, రేవంత్‌రెడ్డి పెడచెవిన పెట్టినట్టు బీసీ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. బీసీ జనాభాను తేల్చడానికి రాక రాక వచ్చిన అవకాశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే తప్పుదారి పట్టించారని, అగ్రకులాల వారికి రాజకీయ లబ్ధి చేకూర్చడానికే బీసీ జనాభాను తక్కువ చేసి చూపించారని కాంగ్రెస్ పార్టీలోని బీసీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో కులగణన తప్పిదాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా కులగణనను తన డ్రీమ్ ప్రాజెక్టుగా చూస్తున్న రాహుల్‌గాంధీకే నేరుగా ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. తెలంగాణలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు చూసే ఒక మాజీ నేత ద్వారా తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ అగ్రనేతను కలిసినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. 2014లో కేసీఆర్ చేసిన ఎస్‌కేఎస్ సర్వే, ఇటీవల రేవంత్‌రెడ్డి చేసిన కులగణన సర్వే నివేదికలను వారి ముందు పెట్టి బీసీ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించినట్టు తెలిసింది. అప్పట్లో కేసీఆర్ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా పక్కగా సర్వే చేశారని, దుబాయ్, ముంబైలో ఉన్న వాళ్లు కూడా వచ్చి అప్పట్లో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్నారని, అది కరెక్టు సర్వే అని తీన్మార్ మల్లన్న రాహుల్‌గాంధీకి వివరించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన సర్వేలో బీసీ జనాభాను తక్కువ చేసి చూపించారని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ఊహించనంత అప్రతిష్ఠ

శనివారం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ మధుయాష్కీ అగ్రనేత రాహుల్‌గాంధీతో భేటీ అయినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇద్దరి మధ్య దాదాపు 40 నిమిషాలపాటు చర్చ జరిగినట్టుగా సమాచారం. కులగణన సర్వే తీరుతెన్నులు, బీసీ జనాభా నివేదిక బయటపెట్టిన తరువాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, బీసీ సంఘాల అభిప్రాయాలు, కాంగ్రెస్ పార్టీలోని బీసీ నేతల అభిప్రాయాల మీదనే ప్రధానంగా చర్చ జరిగినట్టు తెలిసింది. అనంతరం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై చర్చించినట్టు సమాచారం. రైతు రుణమాఫీ, కులగణన సర్వే కాంగ్రెస్ పార్టీ మైలేజ్‌ని పెంచాల్సిన పథకాలని, కానీ ముఖ్యమంత్రి నిర్లక్ష్యం, దుడుకు స్వభావంతో ఊహించనంత అప్రతిష్ఠ మూటగట్టుకున్నామని మధుయాష్కీ వివరించినట్టు తెలిసింది. దీనిపై మధుయాష్కీ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బీసీ లెక్కలు తప్పని చెప్పా: తీన్మార్ మల్లన్న

కులగణన చేసి నివేదిక బయటపెట్టిన తరువాత తనకున్న పరిచయాలతో ఢిల్లీతో కనెక్ట్ అయ్యానని తీన్మార్ మల్లన్న బహిరంగ వేదిక మీద ప్రకటించారు. సర్వే ద్వారా తేల్చిన బీసీల లెక్కలు తప్పు అని ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. తన ఫిర్యాదుతోనే ఢిల్లీ పెద్దలు పిలవాల్సిన వాళ్లను పిలిచినట్టు పేర్కొన్నారు. అక్కడినుంచి వచ్చాకే కులగణన మళ్లీ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు.

మంత్రివర్గంలో అవకాశం కల్పించాలి

మున్నూరుకాపు రాష్ట్ర సంఘాల నాయకుల డిమాండ్

కవాడిగూడ, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గంలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలని మున్నూరుకాపు రాష్ట్ర సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 2వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరుతూ మున్నూరుకాపు రాష్ట్ర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రవిపటేల్ మాట్లాడుతూ మున్నూరుకాపులకు మంత్రివర్గంలో స్థానంలేకపోవడం శోచనీయమన్నారు. రూ.20 కోట్లతో కోకాపేటలో మున్నూరుకాపు సంక్షేమ భవనాన్ని నిర్మించాలని కోరారు.

అపార్ట్‌మెంట్లలో సర్వేసరిగా జరగలె

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, ఫిబ్రవరి23 (నమస్తే తెలంగాణ): అపార్ట్‌మెంట్లలో ఇంటింటి సర్వేను సరిగా నిర్వహించలేదని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. రీసర్వే ప్రక్రియలో భాగంగా ఆయన ఆదివారం ఇందిరాపార్క్, దోమలగూడ, గాంధీనగర్, బండమైసమ్మ, కవాడిగూడ, అశోక్‌నగర్, జగదీశ్‌నగర్ ఏరియాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో సర్వే ప్రక్రియపై వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలో కేవలం స్టిక్కర్లు అంటించి వెళ్లారని.. వివరాలను నమోదు చేయలేదని స్థానికులు చెప్పారని వెల్లడించారు.

రాజ్యాంగ సవరణకు సిద్ధమా?

బీజేపీకి మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్న

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 23: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లను పెంచాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని, దానిపై బీజేపీ స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కులగణన సర్వే చేశామని, అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణకు ముందుకు వస్తుందా? అని నిలదీశారు.

తెల్లారితే పెండ్లి..తండ్రి హఠాన్మరణం

- కొడుకు పెండ్లి వాయిదా
- సిద్దిపేటలో విషాదం

సత్యనారాయణ గౌడ్ (ఫైల్)

దుబ్బాక,ఫిబ్రవరి 23 : తెల్లారితే కొడుకు పెండ్లి...అర్ధరాత్రి తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. కుటుంబీకులు, బంధువుల వివరాల ప్రకరాం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన రాగుల సత్యనారాయణ గౌడ్(66) విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి. కొంతకాలంగా సిద్దిపేటలో నివాసం ఉంటున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రీనివాస్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలానికి చెందిన యువతితో ఆదివారం ఉదయం 10 గంటలకు దుబ్బాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహం జరగాల్సి ఉంది. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో సత్యనారాయణగౌడ్‌కు గుండెపోటు వచ్చింది. వెంటనే దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో కుటుంబీ